## రూ.11.04 లక్షలు పట్టివేత

ఉండవెల్లి, ఏప్రిల్ 2 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద మంగళవారం భారీగా నగదు పట్టుబడింది. కర్నూల్ జిల్లా కోడుమూరుకు చెందిన బుడగ జంగాల సవారి వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దుస్తుల కొనుగోలుకు హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా ఎఫ్ఎస్‌టీ అధికారులు తనిఖీలు చేపట్టగా.. రూ.10.04 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే కర్నూల్‌కు చెందిన డీకే కరుణాకర్‌రెడ్డి కారులో వెళ్తుండగా.. అధికారులు వాహనాన్ని తనిఖీ చేసి రూ.లక్ష నగదును గుర్తించారు. వీరి వద్ద ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చెక్‌పోస్టును గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తనిఖీ చేశారు. రాష్ట్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతివ్వాలని ఆదేశించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

# ప్రభుత్వాన్ని ఎండగడుతాం

- వంద రోజుల్లో 200మంది రైతుల ఆత్మహత్య
- కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి
- పంట నష్టం కింద ఎకరాకూ రూ.25వేలు ఇవ్వాలి
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2 : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరిస్తూ రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారన్నారు. మంగళవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించిన అనంతరం గువ్వల మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులను నిరుత్సాహానికి గురిచేస్తున్నదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వందరోజులు గడవకముందే 200మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడడానికి కారణమైందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ధాన్యాన్ని అమ్మకండి.. దాచిపెట్టుకోండి.. రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ అయిన రైతులందరూ వెంటనే రూ.2లక్షల రుణం తెచ్చుకోండి.. డిసెంబర్ 9న రుణమాఫీపై సంతకం చేస్తానని చెప్పి ఇప్పటికీ ఉలుకూపలుకూ లేదన్నారు. పింఛన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4వేలు పింఛన్ ఇస్తామని నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చి ప్రస్తుతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రధానంగా రైతులపై కక్ష గట్టినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని, రైతుబంధుపై ఒక్కో మంత్రి ఒక్కోలా మాట్లాతున్నారన్నారు. ఈవిషయమై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనకే క్లారిటీ లేదని, అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు అన్ని చర్చించే మ్యానిఫెస్టో విడుదల చేసి, ఇప్పుడు కొత్తగా చర్చిస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఇదంతా రైతులను మభ్యపెట్టేందుకు చేస్తున్న కుట్రేనని వివరించారు. ఈ సర్కారు రైతులను ఇబ్బంది పెట్టడం చూసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలిస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా గెలవాలి? ఇతర పార్టీల వారిని ఏవిధంగా తమ పార్టీలోకి లాగాలి? అని ఆలోచిస్తుందే తప్పా రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. భవిష్యత్తులో పట్టించుకుంటారనే నమ్మకం కూడా లేదన్నారు. ప్రతిపక్ష పార్టీగా తమ బాధ్యతగా రైతుల పక్షాన గొంతుక వినిపిస్తామని, ఉద్యమాలను ఉధృతం చేస్తూ ప్రభుత్వాన్ని ఎండగడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తామన్నారు. క్వింటా ధాన్యానికి రూ.500ల బోనస్, రైతు భరోసా, పంట నష్టం కింద ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోటికి వచ్చినట్లు మాట్లాడడం మానేసి సమిష్టి నిర్ణయాలను ప్రకటించాలి, అమలు చేయాలి తప్పా తప్పించుకునే ధోరణి మంచి కాదని సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి బీఆర్ఎస్ శ్రేణులు, రైతు అభిమానులందరూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు భాస్కర్‌గౌడ్, మాధవరెడ్డి, నర్సింహ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆల

# బోనస్ ఇవ్వాల్సిందే..

- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- నమ్మి ఓట్లేసిన రైతులను విస్మరించిన సర్కారు
- పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి
- క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేయాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- ధాన్యానికి మద్దతు ధరతో సహా క్వింటాకు రూ.500 అదనంగా చెల్లించాలి
- పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి
- లేదంటే కర్షకుల ఆగ్రహానికి గురికాక తప్పదు
- ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లకు బీఆర్ఎస్ నేతల వినతిపత్రాల అందజేత

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరువు మొదలైందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి రైతు సమస్యలపై మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసినా నీటి నిల్వ నిర్లక్ష్యం కారణంగానే సాగునీరు అందించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సహజంగా వచ్చిన కరువు కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వచ్చిందేనని ఆయన స్పష్టం చేశారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. పంటలను కాపాడుకోవడానికి వేల రూపాయలు వెచ్చించి బోర్లు వేస్తే చుక్క నీరు కూడా పడడం లేదన్నారు. భూగర్భజలాలు అడుగంటి కోతకొచ్చిన వరి పైర్లు పశువులకు మేతగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరోనా సమయంలో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించామని గుర్తుచేశారు. కాంగ్రెసోళ్లు ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన రైతులను ప్రభుత్వం విస్మరించిందన్నారు. కరెంటు కోతలతో పంటలు ఎండిపోయి, అర్ధరాత్రి కరెంటుతో ఎంతో మంది రైతులు విద్యుదా ఘాతంతో చనిపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుంటే భరోసా ఇచ్చేవాళ్లు లేక ఇప్పటికే 200 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. దుక్కి దున్నే సమయంలో అందాల్సిన రైతుబంధు, కోతకొచ్చే దశలో కూడా పూర్తిగా అందించలేకపోయారని విమర్శించారు. ప్రతి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. వెంటనే సర్కారు స్పందించి ఎండిపోయిన పంటల నష్టాన్ని అంచనా వేయించి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతేడాది డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, ఎంపీపీ సుధాశ్రీ, హన్వాడ ఎంపీపీ బాలరాజు, శివరాజు, కరుణాకర్‌గౌడ్, కౌన్సిలర్లు కట్ట రవికిషన్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు

# పంట నష్టాన్ని అంచనా వేయాలి

- పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి
- రూ.2లక్షలు రుణామాఫీని వెంటనే ప్రకటించాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన నడిగడ్డ ఎమ్మెల్యేలు

గద్వాల, ఏప్రిల్ 2 : జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయని, పంటల నష్టాన్ని అంచనా వేయడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతూ గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు మంగళవారం కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు రూ.25వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరితో పాటు వివిధ పంటలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని వానకాలం నుంచే అమలు చేస్తామని చెప్పినా.. ఇప్పటికీ అమలుచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే రైతుబంధుతో పాటు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకుండా.. సీఎం, మంత్రులు ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంపీపీలు రా జారెడ్డి, ప్రతాప్‌గౌడ్, విజయ్, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నా యకులు రమేశ్‌నాయుడు, రాధాకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 15లక్షల ఎకరాల్లో పంటనష్టం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- పరిహారం, బోనస్ వెంటనే అందించాలి
- బీఆర్ఎస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

వనపర్తి, ఏప్రిల్ 2 : రైతులకు పంట పరిహారంతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ వనపర్తి జిల్లా గట్టుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తూనే కరువును వెంట తెచ్చిందని ఎద్దేవా చేశారు. పదేండ్లపాటు భూతల్లిని నమ్ముకొని పంటలు పండించిన రైతులను అధికారంలోకి రాగానే ఎండబెట్టారని ఆరోపించారు. వంద రోజుల్లోనే రాష్ట్రంలో 15లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, దీంతో ఇప్పటివరకు 200మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.500 బోనస్ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పం దించి పంటనష్టం కింద ఎకరానికి రూ. 25వేలు, బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి నాయకులు తిరుపతయ్య, రవిప్రకాశ్‌రెడ్డి, నరసింహ, రఘువర్ధన్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, ధర్మానాయక్, రంగారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, నాగన్నయాదవ్, రవి, అశోక్, సయ్యద్, జమీల్, గిరి, జోహెబ్, గోపాల్, సునీల్, ఖాదర్, శంకర్, మోహన్‌యాదవ్, కొమ్ము శ్రీను, మర్రికుంట శ్రీను పాల్గొన్నారు.

# సీఎం ఇలాఖాలో నీటి కటకట

- సొంత నియోజకవర్గంలో ప్రజల ఇక్కట్లు
- తాగునీరివ్వండి మహాప్రభో అంటూ వేడుకోలు
- నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- మొన్న దోరెపల్లి.. నేడు వాల్యానాయక్‌తండాలో..
- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న వాల్యానాయక్ తండావాసులు

మద్దూర్(కొత్తపల్లి), ఏప్రిల్ 2 : వేసవి ప్రారంభంలోనే కొడంగల్ నియోజకవర్గ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మొన్న మద్దూర్ మండలంలోని దోరెపల్లి ప్రజలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ఘటన మరువకముందే మంగళవారం కొత్తపల్లి మండలం వాల్యానాయక్ తండాలో చోటు చేసుకున్నది. పట్టణాలు, గ్రామాల్లో సైతం బోర్లు ఎండిపోవడం, చాలీచాలని మిషన్ భగీరథ నీటితో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం వాల్యానాయక్ తండాలో సుమారు 200మంది నివసిస్తున్నారు. ఈ గ్రామంలో భగీరథ నీరు రాక నాలుగు రోజులవుతున్నది. తండాలోని బోరు నుంచైనా నీటిని తెచ్చుకుందామంటే స్టార్టర్ లేక పొలాల్లోని బోర్లను ఆశ్రయిస్తున్నారు. కాగా ఎండాకాలంలో తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లోంచి నీళ్లు తెచ్చే క్రమంలో చిన్నారులు, వృద్ధులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన చెందుతున్నారు. దీంతో మంగళవారం పొలం నుంచి స్టార్టర్‌ను తీసుకొచ్చి గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్‌ను స్టార్ట్ చేసుకొని నీళ్లు పట్టుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామంలో నీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేస్తూ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే రోజుకో గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలు నిరసన తెలుపుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొడంగల్‌ను అభివృద్ధి చేస్తారని భావిస్తే కనీసం తాగునీటిని అందించే పరిస్థితి కూడా లేదని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

### దాహం తీర్చండి సారూ..



ఇంట్లోని సోరోళ్లంతా బతుకుదెరువు కోసం పట్నానికి పోయింద్రు. నాకేమో చేతకాదు. మా తండాలో నీళ్లు రాక నాలుగు రోజులైతుంది. గుక్కెడు నీటికోసం పొలాల కాడికి పోతున్నం. అధికారులకు చెప్పి బోరు మోటరు, మిషన్ భగీరథ నీరు మా ఊరికి వచ్చేటట్లు చెయ్యండి సారూ.. – దేవమ్మ, వాల్యానాయక్‌తండా, కొత్తపల్లి మండలం


